



కదిరి మండలంలో జరిగిన రోడ్డు ప్రమాద దృశ్యం

పోలా రామాంజనేయులు అస్తమయం

చేనేత ఉద్యమ కార్మిక కెరటం...
ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాటం...
చేనేత సమస్య అనగానే గుర్తుకు వచ్చే కార్మిక నేత..
నాలుగు దశాబ్దాల పాటు ప్రజా పారాట జీవనం ...
నమ్మిన సిద్ధాంతం కోసం తుదిశ్వాస వరకు ఎర్రజెండాను వీడని కామ్రేడ్...
హ్యాండ్‌లూమ్ పరిరక్షణ కోసం నిరంతరం పరితపించిన నేతన్న నేస్తం.....

నాలుగు దశాబ్దాల పాటు ప్రజా ఉద్యమాన్నే జీవనంగా భావించిన చేనేత కార్మిక ఉద్యమనేత పోలా రామాంజనేయులు(71) అనారోగ్య సమస్యలతో ఆదివారం మధ్యాహ్నం తుదిశ్వాస విడిచారు. చేనేత రంగం అనగానే గుర్తుకు వచ్చే నాయకుడిగా కామ్రేడ్ పోలా రామాంజనేయులు గుర్తింపు పొందారు. పోరాటమే ఊపిరిగా తుదిశ్వాస వరకు జీవనం సాగించారు. కార్మిక, కర్షక, కూలీల సమస్యలపై పోరు సాగించారు. ఉద్యమాన్ని భావితరాలకు అందించి, పోరాట చైతన్య స్ఫూర్తిని నేటి తరానికి అందించిన నేత కన్నుమూశారు.

◆చేనేత ఉద్యమ కెరటంగా గుర్తింపు
◆ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం
◆తుదిశ్వాస వరకు ఉద్యమాలే శ్వాసగా బతికిన నేత
◆ ప్రముఖుల నివాళి
◆నేడు ధర్మవరంలో అంత్యక్రియలు




ఆర్డీవో కార్యాలయం వద్ద జరిగిన ఆందోళనలో పాల్గొన్న పోలా రామాంజనేయులు (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి
ధర్మవరం టౌన్, పుట్టపర్తి రూరల్

పోలా రామాంజనేయులు పేరు చెబితేనే చేనేత కార్మికుల పోరాటం గుర్తుకు వస్తుంది. నాలుగు దశాబ్దాలకుపైగా చేనేత వత్తి రక్షణకై రాజీలేని పోరాటాన్ని సాగించారు. అధికార పార్టీ ఒత్తిళ్లు, కేసులు పెట్టి భయపెట్టే ప్రయత్నాలు చేసినా రాజీపడకుండా చివరి ఆయువు వరకు ఆ వత్తి రక్షణకై పనిచేసిన ఎపి చేనేత కార్మికసంఘం రాష్ట్ర అధ్యక్షులు పోలా రామాంజనేయులు ఆదివారం కన్నుమూశారు. గత కొన్ని రోజులుగా అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్న ఆయన అనంతపురం నగరంలోని ఒక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆరోగ్యం విషమించి ఆదివారం తుదిశ్వాస విడిచారు.

చేనేత వత్తి రక్షణకై రాజీలేని పోరాటం

ఉమ్మడి అనంతపురం జిల్లాలో వ్యవసాయం తరువాత అత్యధిక మంది ఆధారపడిన వృత్తి చేనేత రంగం. అందులోనూ ధర్మవరం చేనేతకు పెట్టింది పేరు. ధర్మవరంలో ప్రతి ఒక్కరూ ఏదో ఒక రూపంలో చేనేతపై ఆధారపడి జీవనం సాగిస్తుంటారు. ఇలాంటి ప్రాంతంలో చేనేత రంగం, కార్మికులకు అండగా పోలా రామాంజినేయులు నిలిచారు. ఎప్పటిప్పుడు కార్మికుల రక్షణ కోరుతూ వారి కోసం నిరంతరం శ్రమించారు. హ్యాండ్‌లూమ్ స్థానంలో పవర్‌లూమ్స్ తీసుకురావాలని పాలకులు అనేక సంవత్సరాలుగా ప్రయత్నాలు సాగిస్తూనే వచ్చారు. వీటన్నింటికీ వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో పోలా రామాంజనేయులు కీలకంగా పనిచేశారు. 2000 సంవత్సరం కాలంలోనే పవర్‌లూమ్స్‌కు ప్రయత్నాలు జరిగితే దీనికి వ్యతిరేకంగా పోరాటం చేయడానికి సిపిఎం నాయకులు కొరటాల సత్యనారాయణ, మహత్మాగాంధీ మనువడు ధర్మవరం విచ్చేశారు. ఇక్కడ పవర్‌లూమ్స్ ఏర్పాటు చేయకూడదంటూ పెద్దఎత్తున సాగిన పోరాటంలో పాల్గొన్నారు. ఈ పోరాటంలో పోలా రామాంజనేయులు కీలకంగా వ్యవహరించారు. నేతన్నలను ఐక్యం చేసి పవరలూమ్స్ ధర్మవరం రాకుండా పోరాటం చేశారు. ఆ సమయంలో ఆయనపై కేసులు నమోదయ్యాయి. ఈ పోరాట ఫలితంగా పవర్‌లూమ్స్ జిల్లాకు రాకుండా అడ్డుకోగలిగారు. పోరాటం సాగిస్తున్న నాయకులు, అందులోనూ ప్రముఖభూమిక వహిస్తున్న పోలా రామాంజినేయులును కట్టడి చేయడానికి ఆయనపై తప్పుడు హత్యకేసును సైతం అప్పటి కాంగ్రెసు నాయకులు మోపారు. పవర్‌లూమ్స్‌కు అనుకూలంగా వ్యవహరిస్తే ఈ కేసును ఎత్తివేస్తామని ఒత్తిడులు తెచ్చినా పోలా వారితో రాజీపడకుండా కార్మికులకు మద్దతుగా పోరాటాన్ని సాగించారు. పవర్‌లూమ్స్‌ను జిల్లాలో ఏర్పాఉ చేయకుండా అప్పటి ఉమ్మడి జిల్లా కలెక్టర్‌తో ఓ కమిటీని ఏర్పాటు చేయించి జీవోను సైతం తెచ్చారు. చేనేత రిజర్వేషన్ యాక్టు అమలు చేయాలని నిరంతరం పోరాటం సాగించారు. మూడు పర్యాయాలు ఎపి చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులుగానూ పనిచేశారు. గతేడాది ఎమ్మిగనూరులో జరిగిన ఎపి చేనేత కార్మిక సంఘం మహాసభల్లో మూడవ సారి రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు.



పోలా రామాంజనేయులు (ఫైల్ ఫొటో)

కౌన్సిలర్‌గానూ ప్రాతినిధ్యం

పోలా రామాంజినేయులు ఒక్క చేనేత కార్మిక సంఘం నాయకుడిగానే కాకుండా ప్రజా నాయకుడిగానూ పనిచేశారు. ధర్మవరం పురపాలక సంఘంలో 32వ వార్డుకు రెండుసార్లు కౌన్సిలర్లుగా ఎన్నికయ్యారు. వామపక్ష పార్టీ నాయకులు కౌన్సిలర్‌గా గెలవడం ఏమిటంటూ భూర్జువా పార్టీల చర్యలను తిప్పికొడుతూ ఆయన ధర్మవరం మున్సిపాల్టీకి రెండు సార్లు కౌన్సిలర్‌గా ఎన్నిక అయ్యారు. కౌన్సిలర్‌గా ఉన్న సమయంలో ప్రజా సమస్యలపై పురపాలక సంఘంలో పోరాటం సాగించారు. అనునిత్యం అధికారులు, పాలకవర్గాన్ని తన పదునైనా మాటలతూటాలతో ప్రశ్నించారు. ఓ వైపు కౌన్సిలర్‌గా మరో వైపు కార్మిక సంఘం నాయకుడిగా అనేక పోరాటాల్లో పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపైనా పోరాటం..

పరిగిలో జరిగిన ఎస్‌ఎ.రావత్ పరిశ్రమలో కార్మికుల సమస్యలపై పోరాటం చేశారు. పరిగి నుంచి అనంతపురం వరకు సాగిన యాత్రలోనూ కీలకంగా వ్యవహరించారు. ధర్మవరంతో పాటు, పరిసర మండలాల్లో నిర్వహించిన భూపోరాటాల్లోనూ పాల్గొన్నారు. చేనేత కార్మికులకు మగ్గాలు వేసుకునేందుకు అనువుగా రెండు సెంట్లకు పైగా స్థలాన్ని ఇచ్చి గృహాలు నిర్మించి ఇవ్వాలన్న డిమాండ్‌తో ఆయన ఉద్యమాలను సాగించారు. ఇదే విషయంపై మంత్రులు, ముఖ్యమంత్రుల దృష్టికి కూడా తీసుకెళ్లారు. ధర్మవరానికి అధికారంలో ఉన్న ఏ ముఖ్య నాయుడు వచ్చినా చేనేత సమస్యలపై మాట్లాడాలంటే పోలా రామాంజినేయులును సంప్రదించేవారు. చేనేతపై ఆయనకు ఉన్న పట్టు, సమస్యల పరిష్కారంపై ఆయనకు ఉన్న చిత్త శుద్ధి నాయకులను సైతం ఆలోచింపజేసేది. ఇలా జీవితకాలం మొత్తం చేనేత, కార్మిక, ప్రజా సమస్యలపై పోరాటం సాగించిన నాయకుడిగా పోలా రామాంజనేయులు గుర్తింపు పొందారు.

పలువురి సంతాపం

చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు, సిపిఎం సీనియర్ నాయకులు, ధర్మవరం మాజీ మున్సిపల్ కౌన్సిలర్ పోలా రామాంజనేయులు మృతికి పలువురు సంతాపం తెలిపారు. ఆయన మృతి విషయం తెలుసుకున్న అన్ని రాజకీయ పార్టీల నాయకులు సంతాపం తెలియజేశారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ప్రగాఢ సంతాపం తెలిపారు. చేనేత కార్మికుల పక్షాన అనేక పోరాటాలు చేశారని గుర్తుచేసుకున్నారు. సిపిఎం ఉమ్మడి జిల్లా కమిటీ సభ్యులుగా, సత్యసాయి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులుగా పనిచేసిన ఆయన అనారోగ్య సమస్యలు ఉన్నప్పటికీ చివరి వరకు పేదల కోసం పోరాడారన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు, సత్యసాయి సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్, అనంతపురం జిల్లా నాయకులు బాలరంగయ్య, రామిరెడ్డి తదితరులు ధర్మవరంలో పోలా రామాంజనేయులు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

నేడు ధర్మవరంలో అంత్యక్రియలు

చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోలా రామాంజినేయులు అంత్యక్రియలు సోమవారం నాడు జరగనున్నాయి. ఉదయం 9 గంటలకు ధర్మవరంలో ఆయన నివాసం నుంచి అంత్యక్రియలను నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలియజేశారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లను చేస్తున్నారు.





పోలా రామాంజనేయులు భౌతికకాయం వద్ద నివాళి అర్పిస్తున్న రాంభూపాల్, ఓబులు, ఇంతియాజ్ తదితరులు

రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి

కదిరి మండల పరిధిలోని ఎర్రదొడ్డి గ్రామం వద్ద ఆదివారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతిచెందారు. కారు, ఆటో ఢీకొన్న ఈ ప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే మృతిచెందారు. ఆసుపత్రికి తరలిస్తుండగా మరొకరు మృతిచెందారు.

పూర్తి వార్త 6వ పేజీలో



ఆర్‌డబ్ల్యుఎస్ అధికారితో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు

ఫలించిన పోరాటం

శ్రీసత్యసాయి కార్మికులతో అధికారుల చర్చలు సఫలం
సమ్మె విరమణ ... విధుల్లోకి కార్మికులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

వేతన బకాయిలు, పిఎఫ్, ఇఎస్ఐ, గ్రాట్యూటీ వంటివి చెల్లించాలని డిమాండ్ చేస్తూ శ్రీసత్యసాయి తాగునీటి సరఫరా పథకం కార్మికులు చేపట్టిన పోరాటం ఫలించింది. కార్మికులతో అధికారులు జరిపిన చర్చలు సఫలమయ్యాయి. నిరవదిక సమ్మెతో తాగునీటి సరఫరా నిలిచిపోయి జిల్లా ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు కార్మిక సంఘాల నాయకులు, కార్మికులతో నిర్వహించిన చర్చలు సఫలవంతం అయ్యాయి. ఆదివారం ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ కార్యాలయంలో నిర్వహించిన చర్చలకు ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ అసన్‌బాషా, డీఈ రామారావు, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు, శ్రీసత్యసాయి కార్మికుల యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుల జి.ఓబులు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్, శ్రీసత్యసాయి కార్మికుల యూనియన్ అధ్యక్షులు ఈశ్వరయ్య, కార్యదర్శి శ్రీనివాసులు, కోశాధికారి శ్రీరాములు, మాజీ నాయకులు తిప్పేస్వామి, ఉపాధ్యక్షులు వన్నూరప్ప, ప్రసాద్, రవీంద్రాచారి, లక్ష్మిరెడ్డి తదితరులు హాజరయ్యారు. కార్మికులకు 2 నెలల వేతనాలు ప్రస్తుతం చెల్లిస్తూ, మూడు నెలల వేతనాలు సెప్టెంబర్ 20 లోగా చెల్లిస్తామని అధికారులు తెలిపారు. అంతేకాకుండా 8 నెలల పిఎఫ్ పూర్తిగా చెల్లిస్తామని 18 నెలల ఇఎస్ఐ బకాయిలు చెల్లిస్తామనిఅక్టోబర్ నెల నుంచి వేతనం రూ.500 పెంపుదల చేస్తామని ప్రకటించారు. నెలకు బోనస్ రూ.1100 పెంపుదల చేసి చెల్లిస్తున్నట్లు తెలిపారు. సంవత్సరానికి 18 రోజులు సెలవులు పెట్టుకోవచ్చన్నారు. దీంతో అధికారులు ఇచ్చిన హామీలకు కార్మిక సంఘాల నేతలు అంగీకరిస్తూ సమ్మె విరమిస్తున్నట్లు తెలిపారు. దీంతో కార్మికులు 19 రోజుల రిలే దీక్షలు, 10 రోజుల పాటు నిర్వహించిన నిరవదిక సమ్మె విరమించినట్లు అయింది. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు మాట్లాడుతూ కార్మికుల సమస్యలపై సానుకూలంగా స్పందించి పరిష్కారానికి కృషి చేసిన జిల్లా కలెక్టర్, శ్రీసత్యసాయి బోర్డ్ చైర్మన్ ఎం.గౌతమికి కృతజ్ఞతలు తెలిపారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ, ఇతర అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. పిఎఫ్ సక్రమంగా పడటం లేదని, ప్రతి నెలా చెల్లించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎల్‌టి సంస్థ ఉన్నప్పుడు సబ్ కాంట్రాక్టర్లు 100 మంది కార్మికులకు సంబంధించిన పిఎఫ్ చెల్లించాల్సి ఉందని, అవి చెల్లించేలా చూడాలని కోరారు. సమ్మె సందర్భంగా కక్ష సాధింపు చర్యలు ఉండకూడదన్నారు. సమ్మె కాలానికి వేతనంతో కూడిన సెలవులు ఇవ్వాలన్నారు. తాడిపత్రి పంప్ హౌస్‌లో పని చేస్తున్న సూపర్‌వైజర్ శంకర్ కార్మికుల పట్ల కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని, అతనిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్పందించిన అధికారులు పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. సమ్మెకు సహకరించిన కార్మిక, రైతు, కౌలు రైతు, విద్యార్థి, యువజన సంఘాలు, ప్రజలు, మీడియా ప్రతినిధులు, అధికారులకు సిఐటియు రాష్ట్ర కమిటీ, స్ట్రగుల్ కమిటీ, శ్రీసత్యసాయి శ్రీరామిరెడ్డి కార్మికుల యూనియన్ తరుపున కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా మోటార్ పంప్‌లు ఆన్ చేసి నీటి సఫరాను అధికారులు ప్రారంభించారు. కార్మికుల పోరాట ఫలితంగా వేతనాల చెల్లింపు జరిగాయని, కార్మికులు ఐక్యంగా ఉండి హక్కుల కోసం నిలబడితే సమస్యలు పరిష్కారమవుతాయన్న సత్యం రుజువైందని నాయకులు ఈసందర్భంగా అన్నారు.



చిలమత్తూరు మండలంలో ఎండిపోతున్న పంటపొలం వద్ద దిగాలుగా కూర్చొన్న రైతు

ఉమ్మడి 'అనంత'లో కమ్ముకున్న కరువు

పాలకుల సేవలో అధికారులు...
ఎన్నికల యావలో అధికార, ప్రతిపక్ష పార్టీలు
ఎండుతున్న పంటలు...అడుగంటిన భూగర్భ జలాలు
ఉక్కిరి బిక్కిరి అవుతున్న రైతన్నలు

ఉమ్మడి అనంత జిల్లా వ్యాప్తంగా చినుకు రాలక పంటలు నిలువునా ఎండిపోతున్నాయి. జిల్లాలో వానలే తక్కువ. అందులోనూ లోటు వర్షపాతం. ఈ ఏడాది ఖరీఫ్‌పై రైతన్నలు ఆశలు వదులుకున్నారు. జూన్‌లో కురిసిన చిన్న వర్షానికే రైతులు వరుణుడిపై ఆశలు పెట్టుకుని విత్తనం వేశారు. అయితే చినుకు జాడే లేకపోవటంతో ఉమ్మడి అనంత జిల్లా వ్యాప్తంగా కరువు కమ్ముకువస్తూంది. ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాల్సిన అధికారులు పాలకుల సేవలో తరిస్తున్నారు. అధికార, ప్రతిపక్షపార్టీలు ఎన్నికల యావలో ఉన్నాయి. రైతన్నలను ఆదుకోవాలని కమ్యూనిస్టులు గళం విప్పుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు.

ప్రజాశక్తి-హిందూపురం

దుక్కి దున్ని, విత్తనం వేయడానికి సిద్ధంగా ఉన్నా వరుణుడు కరుణించకపోవడం, మరోవైపు రోజురోజుకు భూగర్భజలాలు అడుగంటి పోవడంతో జిల్లాలో అనావృష్టి పరిస్థితులు నానాటికీ తీవ్రతరమవుతున్నాయి. ఖరీఫ్ సీజన్ వచ్చి దాదాపు మూడు నెలలు అవుతోంది. ఈ పాటికి సమృద్ధిగా వర్షాలు పడి, పంటలు కళకళలాడుతూ ఉండాలి. అయితే ఈ ఏడాది పరిస్థితి దారుణంగా ఉంది. వర్షాకాలంలో మండు వేసవిని తలపిస్తోంది. వరుణుడు ముఖం చాటేశాడు. వానలోటు ఎక్కువగా ఉంది. వర్షాధార పంటల సాగు చాలా తగ్గింది. భూగర్భ జలాలు తగ్గుతున్నాయి. దీనికి తోడు విద్యుత్‌కోతలతో మోటార్లు సరిగా పని చేయట్లేదు. గాలి, ఎండ తీవ్రతతో వాతావరణంలో తేమ ఉండట్లేదు. ఈ ఏడాది ఖరీఫ్‌పై రైతన్నలు ఆశలు వదులుకున్నారు. తొలకరి నుంచే వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. జూన్‌లో లోటు వర్షపాతంతో చాలామంది పంట వేయలేదు. జులైలో ఓ మోస్తారు వర్షం కురవడంతో రైతులు అరకొరగా సాగు చేసిన పంటలు తమ కళ్లే ఎదుటే ఎండు ముఖం పట్టాయి. కనీసం ఆగష్టు నెలలో అయిన వర్షాలు కురుస్తాయనిఆశించిన రైతులకు నిరాశ మిగింది. ఈ దయనీయ పరిస్థితికి పాలకుల నిర్లక్ష్యం తోడైంది. అప్రకటిత విద్యుత్ కోతలు, లోవోల్టేజీ కారణంగా బోర్ల కింద సాగు చేసిన పంటలు చేతికి అందని దుస్థితి నెలకొంది. దిక్కుతోచక రైతులు పంటను కాపాడుకోవడానికి కొన్ని ప్రాంతాల్లో ట్యాంకర్లతో పంటలకు తడి అందిస్తున్నారు. దీనిపై నోరు విప్పాల్సిన పాలకులు, పాలకుల నిర్లక్ష్యాన్ని ఎండగట్టాల్సిన ప్రతి పక్షం వచ్చే ఎన్నికల్లో ఎలాగైనా గెలిచి అధికారాన్ని చేపట్టాలని ఎన్నికల యావలో పడింది. కరువుపై ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్న కమ్యూనిస్టుల ఆందోళనలు అధికారులైనా ఆలకిస్తారనుకుంటే వారు పాలకుల సేవలో మునిగి తేలుతున్నారు. దీంతో ఉమ్మడి అనంత జిల్లా రైతులు చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక దిక్కు తోచని స్థితిలో పడ్డారు.

సాగు లేనట్టేనా...?

ఖరీఫ్‌లో వింత ధోరణి ఏర్పడి జిల్లా వ్యాప్తంగా ఎక్కువ మొత్తంలో భూములు ఖాళీగా ఉన్నాయి. ఆగస్టు చివరి వారమైనా వర్షం రాకపోవటంతో చాలాచోట్ల సేద్యం లేక భూములు బీళ్లుగా ఉన్నాయి. రైతులు విత్తనాలు తీసుకున్నప్పటి మంచి వర్షం కోసం ఎదురుచూస్తున్నారు. కనీసం పొలంలో దుక్కి చేసుకోవడానికి కూడా వర్షాలు కురవడం లేదని ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో వేరుశనగ, మొక్కజొన్న, పప్పు ధాన్యాలు సాగు చేసే రైతులు పంట సేద్యంపై ఆశలు వదులుకున్నారు. సీజన్ ప్రారంభమైన్పటి నుంచి రైతులకు ఉత్సాహంగా కనిపించడం లేదు. వేసిన పంట కూడా వర్షాభావం కారణంగా ఎండిపోతున్నాయి.



కనిపించని ప్రత్యామ్నాయ చర్యలు

ఉమ్మడి అనంత జిల్లా వ్యాప్తంగా ప్రధానపంట అయిన వేరుశనగ సాగుకు అదను అయిపోయింది. దీంతో ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టాలని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారే తప్ప క్షేత్ర స్థాయిలో ఆ పరిస్థితి కనిపించడం లేదు. ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలన్నా వర్షం కురవాల్సిందే. ఒక అదను వర్షం కురిసినా ఉలవ, పెసర, అలసంద, జొన్న, కంది తదితర పంటలు సాగు చేసుకోవచ్చని దీంతోకనీసం పశువులకు గడ్డి అయిన దొరుకుంతదని రైతులు ఆకాశం వైపు చూస్తున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే ఉన్న మూగజీవాల్లో సగం అమ్ముకుని మిగిలిన వాటిని కాపాడుకోవాలని పాడి రైతులు అంటున్నారు.

హమ్మయ్య.. చినుకు జాడ ....

ఉమ్మడి జిల్లాలో అక్కడక్కడ పడిన వర్షం
చాలా మండలాల్లో కానరాని చినుకు జాడ

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

కీలకమైన ఆగస్టు మాసంలో ఉమ్మడి అనంతపురం జిల్లాలో చినుకు జాడ కనిపించలేదు. తీవ్ర వర్షాభావ పరిస్థితులతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటువంటి సమయంలో శనివారం రాత్రి నుంచి ఉమ్మడి అనంతపురం జిల్లాలో అక్కక్కడ ఒక మోస్తరు వర్షపాతం నమోదయింది. ఇది కాస్త ఊరటనిచ్చే అంశమైనప్పటికీ ఇంకా అన్ని ప్రాంతాల్లోనూ వర్షం పడలేదు. అనంతపురం జిల్లాలో 17 మండలాల్లో వర్షపాతం నమోదవగా, సత్యసాయి జిల్లాలో 11 మండలాల్లో ఒక మోస్తరు నుంచి చిరుజల్లులు పడ్డాయి.

పుట్లూరులో అత్యధికం

అనంతపురం జిల్లాలో పుట్లూరు మండలంలో అత్యధికంగా 111.6 మిల్లిమీటర్ల వర్షపాతం నమోదయింది. వర్షం బాగా రావడంతో వాగుల్లోనూ, వంకల్లోనూ నీటి ప్రవాహం కనిపించింది. ఇక ఆత్మకూరులో 71.6 మిల్లిమీటర్లు వర్షపాతం నమోదయింది. యల్లనూరులో 63.2 మిల్లిమీటర్లు, తాడిపత్రిలో 55.4 మిల్లిమీటర్లు , యాడికిలో 38.2మిల్లిమీటర్లు, పెద్దపప్పూరులో 24.6 మిల్లిమీటర్లు, నార్పలలో 24.6 మిల్లిమీటర్లు, శింగనమలలో 19.2 మిల్లిమీటర్లు, బుక్కరాయసముద్రంలో 12.2 మిల్లిమీటర్లు వర్షపాతం నమోదయింది. రాప్తాడు, గుత్తి, పెద్దవడుగూరుల్లో తేలికపాటి వర్షపాతం నమోదయింది.

సత్యసాయిలో గాండ్లపెంటలో అత్యధికం

సత్యసాయి జిల్లాలో కదిరి ప్రాంతాల్లోనే అత్యధికంగా వర్షపాతం నమోదయింది. ఆ పది మండలాల పరిధిలోనే ఇప్పుడు పడుతున్న వర్షం ఎక్కువగా ఉండటం గమనార్హం. గాండ్లపెంటలో అత్యధికంగా 82.5 మిల్లిమీటర్లు వర్షపాతం నమోదయింది. ఎన్‌పికుంటలో 52 మిల్లిమీటర్లు, తనకల్లులో 46 మిల్లిమీటర్లు, తలుపులలో 41.5 మిల్లిమీటర్లు, నల్లచెరువులో 40.5 మిల్లిమీటర్లు, ధర్మవరంలో 31.5 మిల్లిమీటర్లు, కదిరిలో 31 మిల్లిమీటర్లు నమోదయింది. ఇవి కాకుండా చెన్నేకొత్తపల్లి, ముదిగుబ్బ, బత్తలపల్లి తదితర ప్రాంతాల్లోనూ తేలికపాటి వర్షాలు పడ్డాయి.



పుట్లూరు మండలంలో చెరువులోకి చేరిన వర్షపునీరు

45 మండలాలు వర్షాభావంలోనే

ఉమ్మడి అనంతపురం జిల్లాలో 63 మండలాలుంటే ఇప్పటికీ ఇంకా 45 మండలాలు వర్షాభావంలోనే ఉన్నాయి. అందులో అనంతపురం జిల్లాలో 22 మండలాలుండగా, సత్యసాయి జిల్లాలో 23 మండలాలున్నాయి. అనంతపురం జిల్లాలో ఇప్పటి వరకు సగటు వర్షపాతం 150.2 మిల్లిమీటర్లు కురవాల్సి ఉండగా216.7 మిల్లిమీటర్లు నమోదయింది. 30.7 శాతం లోటుంది. ఇక సత్యసాయి జిల్లాలో సగటు158.9 మిల్లిమీటర్లకుగానూ 239.8 మిల్లిమీటర్లు నమోదయింది. సాధారణం కంటే 33.7 శాతం లోటుంది.



ఓటరు నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న ఆర్‌డిఒ రాఘవేంద్ర

ఓటరు నమోదు పరిశీలన

గాండ్లపెంట : మండల పరిధిలోని కటారుపల్లి, ద్వారనాల, తుమ్మలబైలు, తదితర గ్రామాల్లో జరుగుతున్న ఓటరు నమోదు ప్రక్రియను ఆదివారం కదిరి ఆర్‌డిఒ రాఘవేంద్ర పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకే వ్యక్తి రెండు చోట్ల ఓటరుగా నమోదై ఉంటే ఒక చోట తొలగించాలని బిఎల్‌ఒలకు సూచించారు. బిఎల్‌ఒలు ప్రతి ఇంటి వద్దకూ వెళ్లి పరిశీలించి ఓట్లు తొలగించాలని తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ హమీద్‌బాషా, విఆర్‌ఒలు, బిఎల్‌ఒలు, తదితరులు పాల్గొన్నారు.

విఆర్‌కు కొత్తచెరువు ఎస్‌ఐ?

కొత్తచెరువు : స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐగా బాధ్యతలు నిర్వహిస్తున్న లింగన్న విఆర్‌కు బదిలీ అయినట్టు సమాచారం. ఈయనపై పలు అవినీతి ఆరోపణలు రావడంతో జిల్లా అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. నూతన ఎస్‌ఐగా సురేష్‌బాబుని నియమించినట్లు తెలిసింది. ఈయన త్వరలోనే బాధ్యతలు చేపట్టనున్నారు.

సిఎం జగన్‌ను కలిసిన సాదత్ అలీఖాన్

కదిరి టౌన్ : సిఎం జగన్‌ను కదిరికి చెందిన మైనార్టీ నాయకులు సాదత్ అలీఖాన్ కలిశారు. శనివారం దివంగత సిఎం వైఎస్‌ఆర్ వర్ధంతి పురస్కరించుకొని వైఎస్‌ఆర్ కడప జిల్లా ఇడుపుల పాయలోని వైఎస్‌ఆర్ ఘాట్ వద్ద సిఎం జగన్‌తో పాటు సాదత్ అలీఖాన్ నివాళులర్పించారు. వైఎస్‌ఆర్ ప్రతిమను సిఎం జగన్‌కు అందజేశారు.

వైఎస్‌ఆర్ క్రికెట్ టోర్నీ విజేత అంబేద్కర్ లయన్స్

కదిరి టౌన్ : వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ బత్తల హరిప్రసాద్, డాక్టర్ బత్తల వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వైఎస్‌ఆర్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా మండల స్థాయిలో అంబేద్కర్ లయన్స్ జట్టు విజేతగా నిలిచింది. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో అంబేద్కర్ లయన్స్, కట్లతండా జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి కట్లతండా టీం ఫీల్డింగ్ ఎంచుకొంది. తొలుత బ్యాటింగ్ చేసిన అంబేద్కర్ లయన్స్ 116 పరుగులు చేయగా కట్లతండా జట్టు 66 పరుగులకు ఆలౌట్ అయ్యింది. గెలిచిన అంబేద్కర్ లయన్స్ జట్టు కదిరి నియోజకవర్గ స్థాయిలో ఆడేందుకు అర్హత సాధించింది. నూర్, బబ్లూ, అజ్రు, మత్తురెడ్డి ఆర్గనైజర్లుగా వ్యవహరించారు.

మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం

కదిరి టౌన్ : గాండ్లపెంట మండల పరిధిలోని నల్లగుట్టతండాకు చెందిన తరుణ్ కుమార్‌నాయక్ అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకొన్న వైసిపి సిఇసి సభ్యులు పూల శ్రీనివాసరెడ్డి ఆదివారం తరుణ్ తండ్రి నును నాయక్‌కి రూ. 10 వేలు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నల్లచెరువు : స్థానిక రామస్వామి ఆలయ సమీపంలో నివాసం ఉండే ఓబులరెడ్డిపల్లి మంగమ్మ శనివారం ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఆమెకు చదువుకుంటున్న ఓ కుమారుడు ఉన్నాడు. ఈ విషయాన్ని మండలం వైసిపి నాయకులు కల్లిపల్లి శ్రీనివాసులు కదిరికి చెందిన బిఎస్ మక్బుల్ అహమ్మద్ దృష్టికి తీసుకెళ్లాడు. స్పందించిన మక్బుల్ ఆ కుటుంబానికి రూ. 10వేలు అందజేసి, అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

బాధితునికి 'చిలకం' పరామర్శ

ధర్మవరం టౌన్ : పట్టణానికి చెందిన సాకే ఆంజనేయులు బెంగళూరుకు ద్విచక్ర వాహనంపై వెళ్తూ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ఈ విషయం తెలుసుకున్న జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి ఆదివారం సాకే ఆంజనేయులు ఇంటికి వెళ్లి పరామర్శించి, యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్య ఖర్చుల కోసం రూ. 5వేలు ఆర్థికసాయం అందజేశారు.

కుల మతాలకు అతీతంగా రక్తదానం

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని జిల్లా ప్రభుత్వాసుపత్రిలో ఉన్న బ్లడ్ బ్యాంక్‌లో ఆదివారం కుల మతాలకు అతీతంగా యువకులు రక్తదానం ఏశారు. ఈ సందర్భంగా టిప్పు సుల్తాన్ మానవతా రక్త దాన సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు ఉమర్ ఫారూక్ ఖాన్ మాట్లాడుతూ తలసేమియా బాధితులకు 20 రోజులకు ఓ సారి రక్తం అవసరమని బ్లడ్ బ్యాంక్ వైద్యులు తెలుపగా యువకులు పెద్దఎత్తున ముందుకు రావాడం అభినందనీయమన్నారు. రక్తదాతలకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు నాజిమ్, ఫయాజ్, అబ్రార్, షాహిద్, బసవేశ్వర కాలనీ మిత్ర బృందం రాము, మంజు, చంద్ర, మౌలానా అబుల్ కలాం ఆజాద్ సామాజిక సేవా సంఘం అధ్యక్షులు అమానుల్లా, మైనార్టీ నాయకులు జమీల్, తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణ మండపానికి విరాళం

మడకశిర : రొళ్ల మండల పరిధిలోని కాలువేపల్లి గ్రామంలో లక్ష్మీరంగనాథస్వామి ఆలయ సమీపంలో నిర్మిస్తున్న కళ్యాణ మండపానికి తమిళనాడులోని కోయంబత్తూర్ గ్రామస్తులు రూ. లక్ష విరాళం అందించినట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు ఆదివారం తెలిపారు. భవిష్యత్తులో కూడా తమ వంతు ఆర్థిక సాయం అందిస్తామని వారు తెలిపినట్లు ఆలయ కమిటీ సభ్యులు కాంతప్ప, రాజన్న, ఎస్.తిమ్మప్ప, బండి రమేష్ తెలిపారు. కార్యక్రమంలో కోయంబత్తూర్‌కు చెందిన భక్తులు జె.వేల్, జె.రవి, లక్ష్మీకాంత్, విజయన్, మురళీధర్ రాజ్, కుమార్, రాధాకుమార్, ఎస్. గౌడ, సురేష్‌బాబు, రామచంద్రన్, మధు, ఆనంద్ పాల్గొన్నారు.



తమిళనాడు భక్తులతో ఆలయ కమిటీ సభ్యులు

ప్రజల్లో చైతన్యం కోసం జెవివి కృషి

ప్రజాశక్తి -పెనుకొండ



జిల్లా స్థాయి మహాసభలో మాట్లాడుతున్న డాక్టర్ రామ్మూర్తి

ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు సైన్స్ పట్ల అవగాహన కార్యక్రమాలు కల్పించడం ద్వారా జన విజ్ఞాన వేదిక(జెవివి) బాధ్యతగా కృషి చేస్తుందని జెవివి నాయకులు డాక్టర్ ఈటి రామ్మూర్తి పేర్కొన్నారు. పట్టణంలోని గ్లోబల్ జెన్ స్కూల్‌లో ఆదివారం ఈటి రామమూర్తి అధ్యక్షతన జెవివి ప్రథమ జిల్లాస్థాయి మహాసభ నిర్వహించిరున. ఈ సందర్భంగా రామ్మూర్తి మాట్లాడుతూ భారత శాస్త్రవేత్తలు చంద్రయాన్-3ని విజయవంతంగా ప్రయోగించి అంతర్జాతీయస్థాయిలో ఖ్యాతి గడించార న్నారు. దేశంలో సూడో సైన్స్ రాజ్యమేలుతోందని, పాలకులు అశాస్త్రీయ విధానాలను అమలుచేస్తున్నారన్నారు. రాష్ట్ర కార్యదర్శి ఎన్.మహేంద్రరెడ్డి మాట్లాడుతూ జెవివి సైన్స్ పట్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల్లో చైతన్యం తెస్తోందన్నారు. రిటైర్డ్ ప్రిన్సిపల్ వాసుదేవరెడ్డి మాట్లాడుతూ ప్రజల్లో సైన్స్ పట్ల అవగాహన కల్పిస్తే మూఢనమ్మకాల వైపు వెళ్లరన్నారు. జిల్లా కార్యదర్శి డాక్టర్ ఆదిశేషు నివేదిక సమర్పించారు. కార్యక్రమంలో నాయకులు హరి, నబి, ధనాపురం వెంకట్రామిరెడ్డి, చైతన్య, గంగిరెడ్డి, రామకృష్ణ, సుధాకర్, రాజశేఖర్‌రెడ్డి, తదితరులు ప్రసంగించారు. అనంతరం జిల్లా నూతన కమిటీని ఏర్పాటు చేశారు. గౌరవాధ్యక్షులుగా వెంకటరామిరెడ్డి, అధ్యక్షులుగా ఎన్.మహిధర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ ఆదిశేషు, సహాయ కార్యదర్శులుగా డాక్టర్ ఈటి రామ్మూర్తి, ఎ.హరి, సుధాకర్, శాస్త్ర ప్రచార కమిటీ సభ్యులుగా ఎంకె నబి, విద్యా కమిటీ సభ్యులుగా రాజశేఖర్, తదితరులను ప్రకటించారు.

ప్రసవం అనంతరం మృతి

ప్రభుత్వాసుపత్రిలో కాన్పునకు వెళ్లిన గర్భిణి

వైద్యుల నిర్లక్ష్యమేనంటూ కుటుంబ సభ్యుల ఆందోళన

ప్రజాశక్తి-హిందూపురం



మృతిచెందిన చంద్రకళ

ప్రసవం అనంతరం అధిక రక్తస్రావం జరిగి మహిళ మృతి చెందిన సంఘటన ఆదివారం పట్టణంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని వీరేపల్లి గ్రామానికి చెందిన మహేష్ తన భార్య చంద్రకళ గర్భం దాల్చడంతో పట్టణంలోని ఓ ప్రయివేటు క్లినిక్‌లో రెగ్యులర్‌గా చూపిస్తూ వస్తున్నారు. ఆమెకు ఆగస్టు 28న డెలివరీ డేట్ ఇచ్చారు. అయినా ప్రసవం కాకపోవడంతో డాక్టర్‌కు చూపించారు. శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత నొప్పులు రావడంతో 2 గంటల సమయంలో ప్రభుత్వాసుపత్రిలో చేర్పించగా తెల్లవారుజామున 5.45 గంటల సమయంలో వైద్యులు, సిబ్బంది సాధారణ ప్రసవం చేయగా ఆడ శిశువు జన్మించింది. ప్రసవం అనంతరం చంద్రకళకు అధిక రక్త స్రావం అవుతుండడంతో వైద్యం అందించడంతో పాటు రక్తాన్ని ఎక్కించారు. అప్పటికీ తగ్గక పోవడంతో వెంటనే అనంతపురం ప్రభుత్వాసుపత్రికి రెఫర్ చేశారు. ప్రయివేటు అంబులెన్సులో తరలిస్తుండగా చాకార్లపల్లి వద్ద స్పృహ లేకపోవడంతో పెనుకొండ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. కుటుంబ సభ్యులు మృతదేహంతో స్థానిక ప్రభుత్వాసుపత్రి వద్దకు చేరుకొని వైద్యురాలి నిర్లక్ష్యమే కారణమని ఆందోళనకు దిగారు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని కోరారు. ఇదిలా ఉండగా విషయం తెలుసుకున్న సిపిఐ నాయకులు బీరేపల్లికి వెళ్లి జరిగిన సంఘటనను బాధితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వాసుపత్రిలో వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే నవజాత శిశువు తల్లికి దూరమైందని ఆరోపించారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు వినోద్‌కుమార్, బాబు, ఫకృద్దీన్, వెంకటేశప్ప, జబివుల్లా, ముత్యాలప్ప, రవి, రామలక్ష్మి, అంజలి, తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి న్యాయం చేయాలి

ప్రజాశక్తి-మడకశిర




కంపెనీ గేటుకి తాళం వేసి ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

మండల పరిధిలోని బసవనపల్లి గ్రామ సమీపంలో ఉన్న జిఆర్‌టి సోలార్ కంపెనీలో పని చేస్తూ మృతిచెందిన కార్మికుడు చంద్రప్ప కుటుంబానికి నష్ట పరిహారం చెల్లించాలని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం వారు సోలార్ కంపెనీ గేటుకు తాళాలు వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రప్ప నాలుగేళ్లుగా జిఆర్‌టి సోలార్ కంపెనీలో పని చేస్తున్నాడన్నారు. శుక్రవారం విధులకు వెళ్లగా ఛాతిలో నొప్పి రావడంతో తోటి కార్మికులు వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తీసుకెళ్లారు. డాక్టర్ సూచన మేరకు మడకశిర ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడని తల్లి లక్ష్మమ్మ, సోదరుడు శశిధర్ వాపోయారు. చంద్రప్ప కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని కంపెనీ యాజమాన్యాన్ని కోరగా పొంతనలేని సమాధానం చెప్పారని గ్రామస్తులు పేర్కొన్నారున. బాధిత కుటుంబానికి యాజమాన్యం పరిహారం చెల్లించకపోతే కంపెనీ ముందు ధర్నా చేయడమే గాక కంపెనీని మూతపడేలా చేస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి మల్లికార్జున, గురుస్వామి, అంజనప్ప, వీరేష్, శివకుమార్, భోజేగౌడ్, లోకేష్, తిప్పేస్వామి, గిరీష్, తదితరులు పాల్గొన్నారు.

కరాటే బెల్టు పరీక్షలో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-కదిరి టౌన్




కరాటే బెల్టు పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు

విద్యార్థులకు చదువుతో పాటు కరాటే కూడా చాలా అవసరమని ఎపి పోలీస్ అకాడమీ కరాటే కోచ్ వి.మురళీ కృష్ణారెడ్డి సూచించారు. కరాటే మాస్టర్ షాకీర్ ఆధ్వర్యంలో పట్టణంలోని జడ్పి హైస్కూల్ ఆవరణలో ఆదివారం కరాటే బెల్టు పరీక్షలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా అఫిషియల్ ఎగ్జామినర్, ఎపి పోలీస్ అకాడమీ కరాటే కోచ్ వి.మురళీకృష్ణ రెడ్డి హాజరై విద్యార్థులకు బెల్టు పరీక్షలు నిర్వహించారు. కరాటే వల్ల కలిగే లాభాలు, ఉపయోగాలను విద్యార్థులకు వివరించారు. కలర్ బెల్ట్, సీనియర్ బ్రౌన్ బెల్ట్ పరీక్షలో మొత్తం 26 మంది విద్యార్థినీ, విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. వారిలో హారిక, దీక్షిత, భవిత్ రాయల్, జోషిత, రిత్విక్‌రెడ్డి, మయురేశ్ ఎల్లో బెల్టు సాధించారున. చేతన్ ఆరంజ్ బెల్టు, ప్రణవ్, జశ్విత, మహమ్మద్ ఫహీం, గీత, జోయా ఫాతిమా, చరణ్ ప్రేమ్‌సాయి గ్రీన్ బెల్టు, రబ్బన్, రిహాన్, తపన్, కృష్ణకీర్తి బ్లూ బెల్టు, వైష్ణవి, సుహాన, హర్షవర్ధన్, మహమ్మద్ కైఫ్ పర్పుల్ బెల్టు, సీనియర్ బ్రౌన్ బెల్ట్‌లో హిమవంత్ సాయి ఫోర్త్ డాన్, నితిక, లవణ్‌కుమార్ థర్డ్ డాన్, లక్ష్మీనరసింహారెడ్డి, రీదా ముస్కాన్, రోష్ని బ్రౌన్ ఫస్ట్ డాన్‌ను సాధించినారు. వారికి మురళీకృష్ణారెడ్డి బెల్టులు, ప్రశంసాపత్రాలు అందజేశారున. మాస్టర్ షాకీర్‌ని అభినందించారు. కార్యక్రమంలో కరాటే ఇన్‌స్ట్రక్టర్ రంజిత్, అలైహి వసల్లం, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సేవాభావంతో ముందుకు సాగాలి : డీఎస్పీ


ప్రజాశక్తి-తనకల్లు



పోలీసు సిబ్బందికి యూనిఫాం అందజేస్తున్న డీఎస్పీ శ్రీలత

ప్రతి ఒక్కరూ సేవా భావంతో ముందుకు సాగాలని కదిరి డీఎస్పీ శ్రీలత సూచించారు. మండల పరిధిలోని కనసానివారి పల్లి వద్ద వెలిసిన ధనకొండ గంగమ్మ దేవస్థానంలో విగ్రహ ప్రతిష్టాపన సందర్భంగా బందోబస్తు నిర్వహించిన పోలీసులకు పారిశ్రామికవేత్త ఎంజి రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ ద్వారా ఖాకీ యూనిఫాం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పారిశ్రామికవేత్త ఎంజి రెడ్డి మండలంలో సేవా కార్యక్రమాలు నిర్వహిం చడం అభినందనీయమని తెలిపారు. పుట్టిన గ్రామంలో సొంత ఖర్చుతో గంగమ్మ తల్లి ఆలయాన్ని పునర్ నిర్మించడం హర్షించదగిన విషయమని కొనియాడారు. పలువురు కానిస్టేబుళ్ల, సిబ్బందికి యూనిఫాం అందజేసి దుశ్శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో కదిరి రూరల్ సిఐ శంకర్‌నాయక్, ఎస్‌ఐ రాంభూపాల్ యాదవ్, ఎఎస్‌ఐ నరసింహులు, వినోద్‌కుమార్, సమరసింహారెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, చంద్ర, బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నూర్‌బాషా రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శిగా హైదర్‌వలి



హైదర్‌వలిని సన్మానిస్తున్న నాయకులు

గోరంట్ల రూరల్ : నూర్‌బాషా(దూదేకుల) సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శిగా మండలానికి చెందిన కొడైకంటి హైదర్‌వలి ఎన్నిక కావడంతో ఆదివారం మండలానికి చెందిన అన్ని కుల సంఘాల సమక్షంలో అఖిల భారత వలస కార్మికుల అధ్యక్షులు మందాడి భాస్కర్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రిటైర్డ్ ఎంఇఒ శ్రీరాములు, కొత్తచెరువు మాజీ జడ్పిటిసి గపూర్‌సాబ్, వెటర్నరీ డాక్టర్ ఎం.శివారెడ్డి, పులేరు ఎంపిటిసి హైదర్‌వలి, ఆర్‌ఎంపి బాబయ్య, గంగంపల్లి షాకీర్, రిటైర్డ్ పోస్టుమాస్టర్ బాషుసాబ్, కుల సంఘాల సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మున్సిపల్ పిఐఒకు రాష్ట్ర సమాచార కమిషన్ నోటీసులు

ప్రజాశక్తి-తనకల్లు



న్యాయవాది వెంకటరామిరెడ్డి

ఆర్‌టిఐ దరఖాస్తుదారునికి నిర్ణీత సమయంలో సమాచారం ఇవ్వని కదిరి మున్సిపల్ పౌర సమాచార అధికారి (పిఐఒ)కి రాష్ట్ర సమాచార కమిషన్ షోకాజు నోటీసులు జారీ చేసింది. మున్సిపాలిటీ పరిధిలో ప్రత్యేకాధికారుల పాలనా సమయంలో చేసిన పనులు, ఖర్చుల వివరాలు కోసం తనకల్లుకు చెందిన న్యాయవాది వెంకట రామిరెడ్డి 2021 మే లో దరఖాస్తు చేశాడు. నిర్ణీత సమయంలో సమాచారం ఇవ్వకపోవడంతో ఆయన అదే ఏడాది జులైలో అప్పీల్ చేశాడు. అయినా సమాచారం అందలేదు. దీంతో రాష్ట్ర సమాచార కమిషన్‌ను ఆశ్రయించాడు. ఈ విషయంపై మరిన్ని వివరాలు కావాలంటూ 2022 ఏప్రిల్‌లో రాష్ట్ర సమాచార కమిషన్ దరఖాస్తుదారుడికి నోటీసు పంపింది. ఆగష్టు 9వ తేదీ రాష్ట్ర సమాచార కమిషన్ కార్యాలంలో ఈ కేసు విచారణ జరిగింది. ఈ అంశంపై విచారణ చేసిన సమాచార కమిషన్ దరఖాస్తుదారునికి సమాచారం ఇవ్వాలని ఆదేశించింది. దీంతో పాటు నిర్ణీత సమయంలో దరఖాస్తుదా రుడికి సమాచారం ఇవ్వని అప్పటి పిఐఒతో పాటు ప్రస్తుత పిఐఒకు షోకాజు నోటీసులు పంపారు. సమాచారం ఇవ్వని వారి నుంచి జరిమానా ఎందుకు వసూలు చేయకూడదో సమాధానం ఇవ్వాలని అందులో పేర్కొంది. దీంతో ఆర్‌టిఐ దరఖాస్తు చేసుకున్న రెండేళ్లకు దరఖాస్తుదారునికి సమాచారం అందింది.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

ధర్మవరం టౌన్ : రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు సిఎం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని టిడిపి నాయకులు పేర్కొ న్నారు. పట్టణంలోని 25వ వార్డు లక్ష్మీచెన్నకేశవపురంలో ఆదివారం 'భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 25వ వార్డు ఇన్‌ఛార్జి భీమనేని ప్రసాద్‌నాయుడు, కో ఆర్డినేటర్ పరిశే సుధాకర్, యూనిట్, బూత్ కన్వీనర్లు, సెక్షన్ ఇన్‌ఛార్జి ఇంటింటికీ వెళ్లి మినీ మేనిఫెస్టో కరపత్రాలను అందజేస్తూ ఆయా పథకాల లబ్ధి గురించి వివరించారు. వైసిపి నాలుగేళ్ల పాలనలో అరాచకాలు, దౌర్జన్యాలు, దాడులు తప్పా అభివృద్ధి ఎక్కడైనా కనిపించిందా అని నాయకులు ప్రశ్నించారు. రాష్ట్రం బాగుండాలంటే చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకుందామని వారు ప్రజలతో అన్నారు. కార్యక్రమంలో నాయకులు గడ్డం సూరి, క్లస్టర్ రామాంజి, అనిల్, అమర్‌నాథ్‌చౌదరి, బొమ్మలాట శివ, సుజాత పాల్గొన్నారు.

మార్బుల్ గ్రానైట్స్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

హిందూపురం : మార్బుల్ గ్రానైట్స్ కార్మికుల సమస్యలపై అధికారులతో చర్చించి పరిష్కరిస్తామని వైసిపి నేత గుడ్డంపల్లి వేణురెడ్డి హామీ ఇచ్చారు. స్థానిక పరిగి రోడ్డులో ఆదివారం మార్బుల్ గ్రానైట్స్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరవగా కార్మికులు వారి సమస్యలను వివరించారు. ఆయన మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్యం వల్ల కార్మికుల సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. కార్మికుల సమస్యలను అధికారులకు వివరించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం కార్మికులు చేపట్టిన బైక్ ర్యాలీని వేణురెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో యూనియన్ ప్రెసిడెంట్ షామీర్, వైస్ ప్రెసిడెంట్ కోటేశ్వరరావు, సాధిక్, జనరల్ సెక్రటరీ గంగాధర్, కమిటీ సభ్యులు సమీవుల్లా, వెంకటేష్, ప్లంబర్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ధర్మపురం షాకీర్, ఎన్.బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి

ప్రజాశక్తి-కదిరి అర్బన్

సత్యసాయి జిల్లా కదిరి మండల పరిధిలోని ఎర్రదొడ్డి గ్రామం వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతిచెందారు. ఈ ప్రమాదానికి సంబంధించిన పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు... బుక్కపట్నం పరిధిలోని మదిరే బైలుతండా గ్రామానికి చెందిన కొంతమంది కదిరి పట్టణానికి సొంత పనుల మీద వచ్చి ఆటోలో స్వగ్రామానికి వెళుతున్నారు. ఆటోలో నీటి పైపులను వేసుకున్నారు. వీరి ఆటోను కదిరి మండలం ఎర్రదొడ్డి సమీపాన కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో గ్రామానికి చెందిన చిన్నస్వామి నాయక్(45) చలపతి నాయక్ (46) ఆటో డ్రైవర్ భాస్కర్ నాయక్ (40) మృతిచెందారు. మృతుడు చిన్నస్వామి నాయక్ మధిర బైలుతండా సర్పంచి విజయ బాయి భర్త అని గ్రామస్తులు తెలిపారు. ఈ ప్రమాదంలో గాయపడిన మరికొందరిని చికిత్స నిమిత్తం కదిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వారిలో శ్రీలేఖ(35) అనే మహిళ పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురం తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందింది. ఘటనాస్థలాన్ని డీఎస్పీ శ్రీలత, సిఐలు సూర్యనారాయణ, తమ్మిశెట్టి మధు పరిశీలించారు.

మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని గిరిజన సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు రోడ్డుపై బైటాయించి వారు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రమాదానికి కారణమైన వారిపై చర్యలు తీసుకొని మృతుల కుటుంబాలను అన్ని విధాలా ఆదుకోవాలన్నారు.

బావిలో పడి యాచకుడి మృతి

ప్రజాశక్తి-గుడిబండ

అమరాపురం మండల పరిధిలోని హనుమంతనపల్లి గ్రామానికి చెందిన యాచకుడు కృష్ణమూర్తి(43) ఆదివారం గుడిబండ గ్రామ సమీపంలోని ఓ వ్యవసాయ బావిలో ప్రమాదవశాత్తూ పడి మృతి చెందాడు. గుడిబండ పోలీసులు తెలిపిన వివరాలు.. కృష్ణమూర్తి ఊరూరా తిరుగుతూ భిక్షాటన చేసుకుంటూ జీవనం సాగించేవాడు. కొద్దిరోజుల క్రితం గుడిబండకు వచ్చి భిక్షాటన చేసుకునేవాడు. ఈ క్రమంలో సమీపంలోని శివకుమార్‌కు చెందిన వ్యవసాయ బావి దగ్గరకు వెళ్లి దుస్తులు శుభ్రం చేసుకొని ఆరవేసి, స్నానం చేసేందుకు బావిలో దిగుతుండగా కాలు జారి నీటిలో పడి మృతి చెందాడు. మధ్యాహ్నం తోటకు వెళ్లిన శివకుమార్ బావిలో తేలుతున్న శవాన్ని గుర్తించి సమాచారం ఇవ్వడంతో కృష్ణమూర్తి సోదరుడు రంగధామప్ప సంఘటనా స్థలానికి చేరుకొన్నాడు. అతడి ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ రామాంజనేయులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి శవాన్ని బావి నుంచి బయటకు తీయించి మడకశిర ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

చిలమత్తూరు : మండల పరిధిలోని అంజనేయతండా సమీపంలో 44వ జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వెంకటాపురం గ్రామానికి చెందిన చంద్రశేఖర్‌రెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. చంద్రశేఖర్‌రెడ్డి వైసిపి వీరాభిమాని. ఇతను తన ద్విచక్ర వాహనానికి ఎప్పుడూ వైసిపి జెండాను కట్టుకొని తిరుగుతుంటాడు. దీంతో మండలంలో వైసిపి వీరాభిమాని చంద్ర అని పిలుస్తుంటారు. బాగేపల్లి నుంచి కొడికొండ చెక్‌పోస్టుకు ద్విచక్ర వాహనంపై వస్తుండగా జెండా ముఖానికి అడ్డు రావడంతో అదుపుతప్పి కిందపడ్డాడు. అంబులెన్స్ సాయంతో బాగేపల్లి ఆసుపత్రికి తరలించారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎస్.వి.సుబ్బారావు





ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

ఉమ్మడి అనంతపురం జిల్లాలో కరువు వెంటాడుతూనే ఉంది. నాలుగైదు ఏళ్లుగా అతివృష్టి, అనావృష్టి వల్ల రైతులు ఎంతగానో నష్టపోతూనే ఉన్నారు. ఈఏడాది జూన్‌లో విత్తనాలు వేయాల్సి ఉండగా తీవ్ర వర్షాభావం వల్ల సత్యసాయి జిల్లాలో సగం విస్తీర్ణంలో కూడా సాగు చేయలేదు. ఈనేపథ్యంలో జిల్లా వ్యవసాయ రంగంలో తీసుకుంటున్న మార్పులు, సమస్య పరిష్కారంపై జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఎస్‌వి సుబ్బారావును ప్రజాశక్తితోవివరించారు.

ప్రశ్న : వ్యవసాయ రంగంలో ఎలాంటి సేవలు అందిస్తున్నారు?

జవాబు : వ్యవసాయ రంగంలో ఇటీవల శాస్త్రవేత్తలు ఎన్నో పరిశోధనలు జరిపి వ్యవసాయ రంగంలో విప్లమాత్మకమైన మార్పులు తేవడానికి వినూత్న పద్ధతులను రైతులకు సూచిస్తున్నారు, వాటి ద్వారా రైతులకు మేలు చేకూరే విధంగా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోంది. మారుతున్న కాలాన్ని బట్టి పురుగుమందుల పిచికారీ, ఎరువులు చల్లడంలో వినూత్న పద్ధతి ద్వారా డ్రోన్లను ఉపయోగిస్తున్నారు. డ్రోన్‌ను వినియోగించడానికి యువతకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి ఒక్కొక్క మండలంలో ఒక పైలెట్ ఆపరేటర్ను ప్రభుత్వం నియమించ నుంది ఒక్కొక్క పైలట్ 5 లక్షల రూపాయల సబ్సిడీతో 15 లక్షల రూపాయలు విలువచేసే డ్రోన్లు కొనుగోలు చేసుకొనుటకు అవకాశం కల్పించారు. వీటిని 40 శాతం సబ్సిడీ 10 శాతం కాంట్రిబ్యూషన్ చెల్లించడంతో మిగిలినది లోన్ పరంగా ఏర్పాటు చేస్తున్నారు. ప్రధానంగా నిరుద్యోగ పుట్టభద్రులకు మంచి అవకాశం.

ప్ర : శ్రీసత్యసాయి జిల్లాలో ఈసారి పంటల పరిస్థితి?

జ : ఈ సంవత్సరం వర్షాభావ పరిస్థితులు నెలకొన్న దృశ్య జిల్లావ్యాప్తంగా వేరుశనగ పంట విస్తీర్ణం బాగా తగ్గింది. అంతేకాక అంతర్ పంటలకు సైతం వేయడానికి రైతులు మక్కువ చూపలేదు. ఈఏడు జిల్లాలో వర్షపాతం 3.27 సెంటీమీటర్లు మాత్రమే నమోదైంది. జిల్లావ్యాప్తంగా 32 మండలాల్లో కేవలం 6 మండలాల్లో మాత్రమే సాధారణ వర్షపాతం నమోదైంది. వేరుశనగ పంపిణీ మాత్రం రైతులకు సకాలంలో అందజేసిన వర్షం అదునులో కురువకపోవడంతో వేరుశనగ విస్తీర్ణం బాగా తగ్గిపోయింది. రైతుల అవసరాన్ని బట్టి వేరుశనగ పంపిణీ చేశాం. వర్షాభావ పరిస్థితులు నెలకొన్న కారణంగా ఉలవలు, సజ్జలు రాగలను, ప్రభుత్వం ప్రస్తుతం రైతులకు సబ్సిడీ ధరలకు రైతు భరోసా కేంద్రాల ద్వారా అందిస్తున్నారు. ఇప్పుడు ఉలవలు వేసుకోవడానికి అనుకూల వాతావరణ ఉన్నందున రైతులకు హెక్టారుకు 10కిలోల చొప్పున పంపిణీ చేస్తున్నాం. కావలసినవారు రైతు భరోసా కేంద్రాల్లో వాటిని పొందవచ్చు.

ప్ర : నాసిరకం విత్తనాలు కొనుగోలు చేసి నష్టపోయిన రైతులను ఆదుకుంటున్నారా?


జ : నాసిరకం విత్తనాలు తీసుకుని చాలామంది రైతులు పంటలను నష్టపోయారు. ఏ కంపెనీ విత్తనాలు తీసుకున్న వాటి బిల్లులు, ఫౌండేషన్ బ్యాగులు, విత్తనాలు ఇచ్చిన బ్యాగులను భద్రంగా ఉంచుకోవాలని పంట దిగుబడి రాకపోతే నష్టపోయిన ఆ కంపెనీలపై శాఖ పరంగా చర్యలు తీసుకుంటాం. సత్యసాయి జిల్లా రైతులు ఎక్కువ శాతం కర్ణాటక ప్రాంతంలోని ఉత్పత్తి అయ్యే విత్తనాలు తీసుకొని పంటలు సాగు చేస్తున్నారు. కర్ణాటకలో విత్తనాలు తీసుకొని నష్టపోయిన రైతులకు ఎలాంటి నష్టపరిహారం అందించలేం. కర్ణాటక విత్తనాల ఉత్పత్తి కంపెనీలపై చర్యలు తీసుకోవడానికి వీలు లేదు. రైతులు నష్టపోకుండా కాలానుగుణంగా పంటలు సాగు చేసుకోవాలి. మొక్కజొన్న, ప్రొద్దుతిరుగుడు, రాగలు తదితర పంటలు వేయడానికి అనుకూలంగా ఉంది.

ప్ర : చిరుధాన్యాల సాగుకు రైతులకు ఎలాంటి ప్రోత్సాహనిస్తున్నారు?

జ : జిల్లావ్యాప్తంగా చిరుధాన్యాల ఉత్పత్తి అధికంగా ఉంది జిల్లాలో 110 హెక్టర్లలో చిరుధాన్యాలు సాగు చేస్తున్నారు. కాలానుగుణంగా వాటి ప్రాధాన్యత పెరుగుతోంది జిల్లాలో చిరుధాన్యాల సాగు గతంలో కంటే ఇప్పుడు ముందంజలో ఉంది సజ్జలు, జొన్నలు, రాగలు, తదితర చిరుధాన్యాలలో పోషక విలువలు ఎక్కువగా ఉన్నందువలన చిరుధాన్యాల సాగుకు పూర్వవైభవం తీసుకువచ్చేలా వ్యవసాయ అధికారులు దృష్టి సాగిస్తున్నారు.

ప్ర : ఏఏ యంత్ర పరికాలను రైతులకు పంపిణీ చేస్తున్నారు?

జ : ప్రభుత్వం ఎంతోమంది రైతులకు వ్యవసాయ యంత్రాలు పరికరాలను సబ్సిడీ ధరకు పంపిణీ చేస్తుంది జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు 384 యూనిట్లు సబ్సిడీ ధరలతో పంపిణీ చేశారు. వ్యవసాయ పరికరాలైన క్రషర్లు, విత్తన గొర్తులు,రోటవేటర్లు, టార్పాలిన్ పట్టలు, తిల్లర్లు, 40శాతంసబ్సిడీతో 13 శాతం రైతులు కాంట్రిబ్యూషన్ కట్టగా 60 శాతంలోన్ సౌకర్యం కల్పించి ఆర్బికే పరిధిలో ఒక్కొక్క యూనిట్ గ్రూపునకు 15 లక్షల రూపాయలు విలువచేసే యంత్ర సామాగ్రిని పంపిణీ చేస్తున్నాము.




విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీచేసిన విదేశీ మహిళలు

ఎస్సీ హాస్టల్‌లో విద్యాసామగ్రి పంపిణీ

పుట్టపర్తి రూరల్ : పుట్టపర్తికి చెందిన శ్రీవాణి బ్లోసమ్స్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం యనుమలపల్లి ఎస్సీ బాలుర వసతి గృహంలో విద్యార్థులకు విద్యా సామగ్రి అందజేశారు. సింగపూర్‌కు చెందిన దాతల సహకారంతో హాస్టల్‌లో 126 మంది విద్యార్థులకు పుస్తకాలు,పెన్నులు, జామెట్రీ పరికరాలు, సత్యసాయి విభూది, చిత్రపటం, చాక్లెట్లు, బిస్కెట్లు, అరటిపండ్లు అందజేశారు. విద్యార్థులతో కలిసి వసతి గృహం ఆవరణలో మొక్కలు నాటారు. ట్రస్ట్ ఛైర్మన్ శ్రీవాణి మాట్లాడుతూ విద్యార్థులు తోటి విద్యార్థులతో స్నేహభావంతో మెలిగి చదువులో రాణించాలన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించడానికి మొక్కలు విరివిగా నాటాలని, పెద్దల పట్ల గౌరవంతో మెలగాలని సూచించారు. కార్యక్రమంలో నేచూరి శ్రీవాణి, శ్రీనివాస్, లలిత జవహర్‌లాల్, హనుమాన్, మల్లికార్జున, హాస్టల్ వార్డెన్‌నాయక్, అధ్యాపక బందం, తదితరులు పాల్గొన్నారు.

బికె పార్థసారథికి శుభాకాంక్షల వెల్లువ

ప్రజాశక్తి-పెనుకొండ



పార్థసారథికి చీనీకాయలతో చేసిన భారీ హారం వేస్తున్న అభిమానులు

టిడిపి జిల్లా అధ్యక్షులు బికె పార్థసారథి జన్మదినం సందర్భంగా ఆదివారం ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున పూలబొకేలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. పట్టణంలోని వై జంక్షన్ వద్ద జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి మునిమడుగు చిన్న వెంకటరాముడు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 64 కిలోల భారీ కేకును పార్థసారథి చేత కట్ చేయించారు. అనంతరం పాదయాత్రగా దర్గా సర్కిల్‌కు చేరుకున్నారు. అక్కడ టిడిపి మైనార్టీ నాయకుల ఆధ్వర్యంలో భారీ చీనీకాయల గజమాలతో సన్మానించి, పూల కిరీటం బహూకరించి కేక్ కట్ చేయించారు. ఎన్టీఆర్ సర్కిల్‌లో విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బోయ అనిల్ ఏర్పాటు చేసిన భారీ కేకును పార్థసారథి కట్ చేశారు. ర్యాలీగా పార్టీ కార్యాలయం వద్దకు చేరుకొన్నారు. అక్కడ మండల ఉపాధ్యక్షులు గుట్టూరు బోయ నాగరాజు ఆధ్వర్యంలో భారీ గజమాలను క్రేన్ సాయంతో వేశారు. పల్లె ఘునాథరెడ్డి, గుండుమల తిప్పేస్వామి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబికా లక్ష్మీనారాయణ, నాయకులు కురుబ కృష్ణమూర్తి, జివిపి నాయుడు, కేశవయ్య, రొద్దం నరసింహులు, తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

మడకశిర : శ్రీసత్యసాయి జిల్లా టిడిపి అధ్యక్షులు బికె పార్థసారథికి ఆదివారం రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పెనుకొండ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో పార్థసారథికి శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో టిఎన్‌టియుసి రాష్ట్ర కార్యదర్శి గురుమూర్తి, కన్వీనర్ దాసిరెడ్డి భరత్, ఈరన్న, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



పార్థసారథిని సన్మానిస్తున్న గుండుమల తిప్పేస్వామి